'మేడిగడ్డ'పై న్యాయ విచారణ చేపట్టాలి

- రైతులకు నష్టం జరగకుండా చూడాలి
- ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- నిజానిజాలను ప్రజల ముందుంచాలి
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, నాగయ్య, జూలకంటి
- ప్రాజెక్టును పరిశీలించిన సిపిఎం రాష్ట్ర కమిటీ బృందం



పాజెక్టును పరిశీలిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రధానంగా చర్చనీయాంశమైన కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నిర్మాణ లోపంపై న్యాయ విచారణ చేపట్టాలని, రైతులకు నష్టం జరగకుండా చూడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (కాళేశ్వరం) ప్రాజెక్టును సోమవారం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో విలేకర్ల సమావేశంలో వీరయ్య మాట్లాడారు. "దేశ చరిత్రలో నీటిపారుదల రంగానికి అత్యధిక నిధులతో నిర్మించిన ప్రాజెక్టు కాళేశ్వరం. అందులో మేడిగడ్డ, లక్ష్మీ బ్యారేజీ పూర్తైన కొద్ది కాలానికే కుంగిపోవడం నిర్మాణ లోపమా? డిజైన్ లోపమా? నాణ్యతా లోపమా? ఏమి జరిగిందో నిపుణులతో న్యాయవిచరణ చేపట్టాలి" అని డిమాండ్ చేశారు. తక్షణమే నిజానిజాలు తేల్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ తానై నిర్మించడం వల్లే మూడు పిల్లర్లు కుంగాయని అన్నారు. కమీషన్ల కోసం రీ డిజైన్ పేరుతో కాళేశ్వరం కట్టి ప్రజాధనాన్ని వృథా చేశారని చెప్పారు. గతంలో వైఎస్ ముఖ్యమంత్రి హయాంలో ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంతో వంద టిఎంసిల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాప్‌కో కంపెనీ అధ్యయనంలో తెలిపిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అదే వ్యాప్ కో కంపెనీ అధ్యయనంలో 110 టిఎంసిల నీటిని ఎత్తిపోయవచ్చని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి ఖర్చు అంచనా వ్యయం పెంచారని ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అధ్యయనంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రాజెక్టులో పూర్తి నీటిమట్టం ఉన్నప్పుడు పిల్లర్లు కుంగితే సమస్య తీవ్రత ఎక్కువ ఉండేదన్నారు. గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయే పరిస్థితి ఉండేదని తెలిపారు. ఇదంతా గత బిఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని రైతుల పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల్లో లబ్ది పొందడం కోసం వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కమీషన్ల కోసమే గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని ఆరోపించారు. లక్ష కోట్లతో నిర్మాణం చేపట్టినప్పుడు.. అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆలోచన చేసి.. నిపుణుల అభిప్రాయం తీసుకొని నిర్మించాల్సి ఉండేదని అన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జి నాగయ్య మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేపట్టి నిజా నిజాలను ప్రజలకు వివరించాలన్నారు. నిపుణులు, ఇంజనీర్ల అభిప్రాయాలను తోసిపుచ్చి కేసీఆర్ అన్నీ తానై ప్రాజెక్టును డిజైన్ చేశారని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలను నీటిపాలు చేశారన్నారు. మే చివరి వారంలో ప్రాణహిత పై నుంచి వచ్చే నీటిని వినియోగించుకోలేని పరిస్థితిలో ఉన్నామని అన్నారు. నిపుణుల అధ్యయనం పూర్తి అయ్యేసరికి పుణ్యకాలం పూర్తవుతుందన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం పది గ్రామాలను హుటాహుటిన తరలించారని గుర్తు చేశారు. ప్రజలు ఏడుస్తున్నా కనికరించలేదన్నారు. పేరు కోసం పాకులాడుతూ ప్రజల ఉసురు పంచుకున్న నాయకుడెవరు బాగుపడ్డట్టు చరిత్రలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెలిశెట్టి రాజయ్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలేం రాజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్, నాయకులు సూదుల శంకర్, ఆకుదారి రమేష్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

టెట్‌కు 1.66 లక్షల దరఖాస్తులు

- రేపటితో ముగియనున్న గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 1,66,475 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 63,524 మంది, పేపర్-2కు 1,02,951 మంది కలిపి 1,66,475 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. సోమవారం ఒక్క రోజే పేపర్-1కు 5,974 మంది, పేపర్-2కు 11,137 మంది కలిపి మొత్తం 17,111 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు బుధవారం వరకే ఉందని తెలిపారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారితపరీక్ష(సిబిటి) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

బిఆర్ఎస్ వల్లే కరువు

- సామా రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చిన కరువు బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టుల పుణ్యమేనని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిపోయిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులే ప్రస్తుతం తెలంగాణను ఆదుకుంటున్నాయని చెప్పారు.

అనుమతి లేకుండా సమావేశం పెట్టారని..

- మెదక్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అనుమతి తీసుకోకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు అయింది. సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఇతరులతో ఎన్నికల సమావేశం వెంకటరామిరెడ్డి, సోడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి నిర్వహించారు. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడుకు బిజెపి, కాంగ్రెస్ నాయకులు సమాచారం అందించారు. సిసి ఫుటేజ్‌లు ఆధారంగా వారిపై కేసు నమోదు అయింది. ఉద్యోగులు, ఇతరులు పారిపోవడంతో అక్కడ ఉన్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

గత అనుభవాలు దిశానిర్దేశం చేస్తాయి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - కల్చరల్

చరిత్రను వాస్తవిక దృష్టితో చూడాలి.. గత అనుభవాలు వర్తమానంలో దిశా నిర్దేశం చేస్తాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. బ్రిటిష్ వారు మనకు ఇచ్చిపోయిన బానిస చరిత్రనే ఇప్పటి వరకు బోధించారన్నారు. చరిత్రను ఎవరి దృక్పథంలో వారు వ్యాఖ్యానించుకునే శాస్త్రీయత ఉండాలని అన్నారు. "జస్టిస్ ఆవుల సాంబశివరావు పురస్కారాలు 2023"కు గాను ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు ఆచార్య వకులాభరణం రామకృష్ణకు, 2024కు గాను మనసు ఫౌండేషన్ స్థాపకులు మన్నం వెంకట రాయుడుకు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టిఆర్ కళా వేదికపై వెంకయ్య నాయుడు పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ఆవుల సాంబశివరావు నిబద్ధత, నిజాయితీ కలిగిన న్యాయమూర్తిగా పేరు పొందారన్నారు. ఆయన నిరాడంబర వ్యక్తిత్వం, తెలుగు భాష సంస్కృతి పట్ల గౌరవం కలవారని చెప్పారు. తెలుగు భాష సంస్కృతి పట్ల యువతలో ఆసక్తి తగ్గుతోందని, నూతన విద్యా విధానం మాతృభాషలో విద్య బోధనకు సముచిత స్థానం ఇచ్చిందని తెలిపారు. ఆంధ్రుల చరిత్రపై లోతైన అధ్యయనం జరిగి సమగ్రంగా రావల్సి ఉందన్నారు. పురస్కార గ్రహీతల్లో ఒకరు చరిత్ర పరిశోధకులు కాగా, మరొకరు తెలుగు భాషా ప్రేమికులు అని అభినందించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కిషన్‌రావు మాట్లాడుతూ.. ఆవుల సాంబశివరావు నిబద్ధత కలిగిన మానవతామూర్తి అన్నారు. మాజీ ఉపాధ్యక్షులు ఆచార్య ఆవుల మంజులత మాట్లాడుతూ.. తెలుగులో తీర్పులు లోకాయుక్తగా తమ తండ్రి ఆవుల సాంబశివరావు ఉన్న సమయంలో ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం పాలకుల విధానాల వల్ల తెలుగే కాదు మరే భాషా సరిగా రాని పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్‌లో అంతరించి పోతున్న భాషల్లో తెలుగు కూడా చేరుతుందన్న ఆందోళన ఉందన్నారు. ఎంతో విజ్ఞాన విషయాలు తెలుగు భాషలో ఉన్నాయని తమ తండ్రి సాంబశివరావు చెప్పేవారని గుర్తు చేశారు. పురస్కార గ్రహీత ఆచార్య వకులాభరణం రామకృష్ణ మాట్లాడుతూ.. భాషా సంస్కృతులు ప్రజల ఆదరణతోనే నిలుస్తాయని, తెలుగు భాష నేర్చుకున్న వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటే.. భాష పది కాలల పాటు ఉంటుందని చెప్పారు. మరొక పురస్కార గ్రహీత వెంకట రాయుడు.. మనసు ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ స్వాగతం పలికిన కార్యక్రమానికి రెడ్డి శ్యామల వ్యాఖ్యానం చేశారు.



పురస్కారాలు ప్రదానం చేస్తున్న వెంకయ్య నాయుడు

వస్త్రపరిశ్రమను ఆదుకోవాలి

- చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- పవర్‌లూమ్ కార్మికుల పోరాటానికి సంఘీభావం
- కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్‌లో తీర్మానం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలనీ, కొత్త ఆర్డర్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిరిసిల్ల నేత కార్మికుల పోరాటానికి సంఘీభావంగా కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ అధ్యక్షతన నిర్వహించారు. సిరిసిల్లలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న తడుక శ్రీనివాస్, సిరిపురం లక్ష్మీనారాయణ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పలు డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టి మాట్లాడారు. సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమను బతికించాలని కోరుతూ నేతన్నలు 48 రోజుల నుంచి పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరిగాదన్నారు. అక్కడ పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోవడానికి కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న విధానాలు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డర్ల బిల్లులు విడుదల చేయకపోవడం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడమే కారణమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.485.89 కోట్ల బకాయిలను చెల్లించాలనీ, గతంలో మాదిరిగానే యూనిట్‌కు రెండు రూపాయల సబ్సిడీ ఇవ్వాలని కోరారు. నేతన్న బీమా, త్రిఫ్ట్ ఫండ్, యారన్ సబ్సిడీ పథకాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన చేనేత, టెక్స్‌టైల్ బోర్డులను పునరుద్ధరించాలనీ, బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ హౌస్ కం వర్క్‌షెడ్, వర్కర్ టూ ఓనర్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతరాములు మాట్లాడుతూ.. పవర్‌లూమ్, చేనేత కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రెండేండ్లకోసారి కూలిరేట్లను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సహకార రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలొచ్చినా రైతులు, నేత కార్మికుల ఆత్మహత్యలు మాత్రం ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లశుద్ధి తప్ప నేతన్నల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే చిత్తశుద్ధి పాలకులకు లేదని విమర్శించారు. పవర్‌లూమ్ పరిశ్రమను దెబ్బతీసేలా కేంద్రం తీసుకున్న నిర్ణయాలపై ఏమాత్రం మాట్లాడని బండి సంజయ్‌కి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు మాట్లాడుతూ.. 30 వేల మంది కార్మికులు రోడ్డునపడ్డా, ఇద్దరు నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. కార్మికులను అణిచివేయాలని చూస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. ధనికులు ఎక్కువగా వినియోగించే వజ్రాలు, బంగారం ఆభరణాలపై మూడుశాతం, విమాన ప్రయాణికులపై ఐదు శాతం జీఎస్టీ విధించి వస్త్రపరిశ్రమపై మాత్రం 12 శాతం విధించడం దారుణమన్నారు. బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ..గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుంటే మేము ఏం చేయాలంటూ మంత్రులు మాట్లాడటం, అర్థంలేని వాదనలు చేయడం సరిగాదని హితవు పలికారు. నేత కార్మికుల పక్షాన జరిగే ఐక్యపోరాటాలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. సిరిసిల్ల నేత కార్మికుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. రౌండ్‌టేబుల్‌లో వృత్తిదారుల సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎమ్‌వీ రమణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి శివబాబు, టిఎన్‌టియుసి అధ్యక్షులు ఎంకె బోస్, పాషికంటి లక్ష్మీనరసయ్య (తెలంగాణ చేనేత కార్మిక సంఘం-ఎఐటియుసి), వనం శాంతికుమార్ (తెలంగాణ చేనేత కార్మిక సంఘం, సిఐటియు), యాటల సోమన్న (ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్), అడిగోపుల సత్యనారాయణ (ఆప్కో మాజీ డైరెక్టర్) తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు సిఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలనీ, ప్రజల ఆశలు, ఆకాంక్షలన్నీ నెరవేరాలని సిఎం ఆకాంక్షించారు. సమృద్ధిగా వానలు కురిసి, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. ఉజ్వల భవిష్యత్తుకు ఈ ఉగాది తోడ్పడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి క్రోధినామ సంవత్సరాది సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాదినుండి కాలచక్రం తిరిగి మొదలవుతుందనీ, చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుందన్నారు. వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాదినుండే ప్రారంభిస్తారనీ, అందువల్ల ఉగాదిని వ్యవసాయ నామ సంవత్సరంగా పిలుచుకోవడం ప్రత్యేకతని తెలిపారు.రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి ఎమ్మెల్యే టి హరీశ్‌రావు తదితరులు రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటికే 5,422 కేంద్రాలు ప్రారంభం
- మరో రెండు రోజుల్లో 1,727 సెంటర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నెలకొల్పింది. గతేడాది ఇదే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని సంగతి తెలిసిందే. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ముందే ప్రారంభించింది. ఇందుకోసం మార్చి చివరి వారంలోనే ధాన్యం కొనుగోళ్ల కోసం 7,149 కేంద్రాలు ఏర్పాటును మొదలు పెట్టింది. ఇప్పటికే 5,422 కేంద్రాలు ప్రారంభం కాగా, మరో రెండు రోజుల్లో మిగతా 1,727 కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. వీటి ద్వారా ఐదు జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా 443 కొనుగోలు కేంద్రాల్లో 4,345 మంది రైతుల నుంచి 31,215 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది దాదాపు 75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంకొనుగోళ్లు జరుగుతాయని అంచనా వేసిన అధికారులు వాటి సేకరణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. వడ్ల సేకరణకు 18.85 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయని అంచనా వేయగా, వాటిలో 14 కోట్ల గన్నీ సంచులు ఇప్పటికే శాఖ వద్ద సిద్ధంగా ఉన్నాయి. వీటితో దాదాపు 56 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసేందుకు వీలవుతుందని అధికారులు చెబుతున్నారు. మిగతా గన్నీ సంచులను తొందరగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది.

370 ఆర్టికల్, ట్రిపుల్ తలాక్ రద్దుకు లేని కమిటీ వర్గీకరణకు ఎందుకు?

- బిజెపికి సతీష్ మాదిగ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

370 ఆర్టికల్, ట్రిపుల్ తలాక్ రద్దు చేసేందుకు అవసరం లేని కమిటీ, షెడ్యూల్ కులాల వర్గీకరణకు ఎందుకని మాదిగ దండోరా అధ్యక్షులు, కాంగ్రెస్ నేత దేవనీ సతీష్ మాదిగ కేంద్రంలోని బిజెపిని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పది జిల్లాల మాదిగ దండోరా ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ కోసం ఉషామెహ్రా కమిషన్ వేసిందని తెలిపారు. అందుకు సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారని గుర్తుచేశారు. ఇలాంటి వాస్తవాలను విస్మరించిన మందకృష్ణ మాదిగ మాదిగల ఓట్లు దండుకోవడాని మోసం చేస్తున్న బిజెపిని గెలిపించాలని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాదిగలకు న్యాయం చేస్తానంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి చెప్పే మాటలు నమ్మొద్దని సూచించారు. రిజర్వేషన్లు ఎత్తేసేందుకు బిజెపి చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ అంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని తెలిపారు.

ఫిబ్రవరి స్టయిపెండ్ చెల్లించండి

- డిఎంఇకి జూడాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఉపకార వేతనాన్ని (స్టయిపెండ్) చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-జూడా) డీఎంఈకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం టీజూడా రాష్ట్ర నాయకులు హైదరాబాద్ లో రాష్ట్ర వైద్యవిద్య సంచాలకురాలు డాక్టర్ వాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయా ఆస్పత్రుల్లో డాక్టర్ల భద్రత, డీఆర్పీ సమస్య, రెసిడెంట్లకు బాండ్లు, హాస్టళ్లలో సదుపాయాల లేమి, ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం తదితరాంశాలపై వారు ఆమెతో చర్చించారు.

కాంగ్రెస్ నాయకునిపై వైద్య సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌పై ఆ జిల్లా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు బానోతు రవిచందర్ బెదిరింపులకు దిగడంపై పలు వైద్యసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సోమవారం తెలంగాణ ప్రభుత్వం వైద్యుల సంఘం, టివివిపి రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘంతో పాటు ఇతర సంఘాల నాయకులు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. రవిచందర్ వెంటనే బేషరతుగా, రాతపూర్వకంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలనీ, ఈ అంశాలపై జిల్లా కలెక్టర్ తో పాటు పోలీస్ సూపరింటెండెంట్ కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

బియ్యం ధరలు పైపైకి..

- పత్తాలేని భారత్ రైస్.. వచ్చిన కొద్దిపాటి బియ్యమూ పక్కదారి?
- జైశ్రీరాం సన్నరకం క్వింటాలు ధర రూ.ఏడువేల పైచిలుకు..
- ముల్కనూర్ సొసైటీ బియ్యమైతే రూ.7500పై మాటే!
- రూ.6500 దాటిన బిపిటి, హెచ్ఎమ్‌టి ధరలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బియ్యం ధరలు రోజురోజుకూ ఆకాశానికి ఎగబాకుతున్నాయి. రెండేండ్ల కిందటి వరకూ క్వింటా బిపిటి రకం రూ.4200లుగా ఉన్న ధర ఇప్పుడు ఏకంగా రూ.6వేలకుపైనే పెరుగుతోంది. ఇక జైశ్రీరాం వంటి సన్నరకాలు రూ.7వేలు దాటాయి. అందులోనూ ముల్కనూర్ సొసైటీ వారు విక్రయిస్తున్న 30 కిలోల బస్తా ప్రస్తుతం రూ.2250 ఉండగా.. క్వింటా బియ్యం రూ.7500 పలుకుతోంది. ధరలు అమాంతం పెరుగుతూ సామాన్యులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కేంద్రం భారత్ రైస్ పేరుతో పదికిలో బస్తా రూ.29కే అందిస్తామని చెప్పి సరుకులు సరఫరా చేస్తోంది. అయితే ఆ బియ్యం జిల్లాకు చేరుకోకపోగా.. శాంపిల్స్ కింద వచ్చిన సుమారు 60క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టినట్టు తెలుస్తోంది. సన్నరకం వడ్లు పండించే వానాకాలంలో మూడేండ్లుగా ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి ఆశించిన మేరకు రావడం లేదు. అందులోనూ సాగు కూడా డిమాండ్‌కు తగ్గట్టుగా ఉండటం లేదు. పర్యవసానంగా సన్నరకం బియ్యం ధరలు ప్రతియేటా పెరుగుతూనే ఉన్నాయి. రానున్న రెండేండ్లలో క్వింటా ధర రూ.తొమ్మిది వేలు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాపార వర్గాలు చెబుతుండటం గమనార్హం.

సామాన్యులకు సన్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నా కట్టడికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అవసరాలకు తగినట్టుగా సన్నవడ్లు పండించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నా.. మార్కెట్‌లో ధరలను నియంత్రించడంలో ప్రభుత్వ వైఫల్యమూ స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు గతంలో దొడ్డు రకం, బిపిటి వంటిరకాల వినియోగం ఎక్కువగా ఉండగా.. రానురానూ దొడ్డురకం బియ్యం వాడకం తగ్గిపోతోంది. ప్రస్తుతం కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఎక్కడ చూసినా సన్నరకం బియ్యం వాడకం ఎక్కువగా పెరగడంతో విక్రయాలకూ డిమాండ్ పెరిగింది. ప్రధానంగా జగిత్యాల జిల్లా, కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాల నుంచి ఎక్కువగా వానాకాలం సీజన్‌లో సన్నరకం వడ్లు పండిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి సేకరించిన వడ్ల నుంచే బియ్యం తీసి మిల్లులు దుకాణదారులకు సరఫరా చేస్తున్నారు. అందులోనూ చాలా మిల్లులు సన్నబియ్యం కొరత సృష్టించి ధర పెంచి దుకాణదారులకు విక్రయిస్తుండగా.. వారు కొంత లాభం చూసుకుని వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. దాంతో ప్రతియేటా క్వింటా బియ్యంపై కనీసంగా రూ.500 పెరుగుతుందంటే అతిశయోక్తి కాదు. ఫలితంగా బిపిటి, హెచ్ఎంటి వంటి రకాలు క్వింటా బియ్యం రూ.6వేలనుంచి రూ.6500మధ్యవినియోగదారులకు అమ్ముతుండగా.. జైశ్రీరాం వంటి రకాలు రూ. ఏడు వేలపైనే అమ్ముతున్నారు.

పత్తాలేని భారత్ రైస్.. వచ్చిన కొద్దిపాటి బియ్యమూ పక్కదారి?

సన్నబియ్యం మార్కెట్లో కిలో రూ.55 నుంచి [illegible] ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్రం భారత్ రైస్ పేరిట 10 కిలోల బస్తా రూ.29కు రాయితీపై విక్రయించేందుకు నిర్ణయించింది. శనగపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.90ల నుంచి రూ.110ల వరకు వాటి నాణ్యతను బట్టి అమ్ముతుండగా.. ఆ పప్పును కూడా భారత్ బ్రాండ్ కింద కిలో రూ.60కే విక్రయిస్తామని చెప్పింది. అందుకు విక్రయించేందుకు ఆర్నెళ్ల కిందటనే ఆదేశాలు జారీచేసింది. ఫిబ్రవరి నుంచి పంపిణీ ప్రారంభించింది. అయితే ఆ సరుకులు ఉమ్మడి జిల్లా సరిహద్దులోని మంచిర్యాలకు రైలుమార్గం ద్వారా వస్తున్నా.. జిల్లాకు వచ్చిన కోటా అత్తెసరనే చెప్పవచ్చు. ఇప్పటివరకు కేవలం 60క్వింటాళ్ల వరకే జిల్లాకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆ బియ్యం కూడా ఎక్కడా పంపిణీ జరిగినట్టు రికార్డుల్లో లేవు. ప్రధానంగా రేషన్ దుకాణాల ద్వారా భారత్ బ్రాండ్ పేరుతో బియ్యం, పప్పులు, ఇతర వంటసామగ్రి విక్రయిస్తే పట్టణ, గ్రామీణ ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటు ధరలోకి వచ్చే అవకాశం ఉంటుంది. అయినా ఆ దిశగా చర్యలు ప్రారంభించలేదు. మరోవైపు బియ్యం, [illegible] రాయితీపై కొద్దిరోజులు పంపిణీ చేశారు. అది కూడా జిల్లాకు చేరలేదు. ప్రస్తుతం ఉల్లిగడ్డ ధర తగ్గడంతో శనగపప్పు,గోధుమపిండి,బియ్యంపంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం బాగున్నా.. ఆచరణలో మాత్రం పూర్తిస్థాయిలో పేదలకు అందడం లేదు. సాధారణంగా కిరాణదుకాణాలు,రైతుబజార్లు, పేరుమోసిన స్టోర్స్, లేక హోల్‌సేల్ షాపుల్లోనే జనం ఎక్కువగా సరుకులు కొనుక్కుంటున్నారు. మొబైల్ స్టోర్స్ పేరిట ఆడపాదడపా వాహనాలపై పెట్టి విక్రయిస్తున్నా.. ఆ సమయంలో అక్కడ అందుబాటులో ఉన్నవారికే రాయితీ సరుకు లభిస్తోంది.. తప్ప క్షేత్రస్థాయిలో ఎవరూ భారత్ పేరిట రాయితీపై వచ్చే సరుకులు చూడలేదనే చెప్పవచ్చు. మరోవైపు మొబైల్ స్టోర్ పేరిట వచ్చే ఈ రాయితీ సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అందులోనూ హోల్‌సేల్ వ్యాపారులకు గంపగుత్తగా కిలో రూ.55 చొప్పున విక్రయించినట్టు విమర్శలు ఉన్నాయి. ఇవీగాక నగరంలోని మెస్‌లకు, పెద్దపెద్ద హోటళ్లకు భారత్ బ్రాండ్ రైస్ అమ్మినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

నీటి సరఫరాకు ఢోకాలేదు

- నెలకు 2.5 లక్షల ట్రిప్పుల మేర నీటి సరఫరాకు ప్రణాళికలు
- భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల వినియోగం పెరిగింది
- ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి : దానకిశోర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దానకిశోర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
"హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్లే జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది.. అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. తాగునీటి సరఫరాకు ఇబ్బందేం లేదు" అని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ తెలిపారు. నగరంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది భూగర్భ జలాలు తగ్గడం, బోర్లు ఎండిపోవడంతో నగరంలో గతం కంటే ట్యాంకర్ వాటర్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. అయినా అందుకు తగ్గట్టుగానే నీరు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. ఈసారి అదనంగా 100 ఎంఎల్‌డిల నీరు సరఫరా చేస్తున్నామన్నారు. అవసరమైతే మరో 100 ఎంఎల్‌డిల నీరు సరఫరా చేసేందుకు జలమండలి సిద్ధంగా ఉందని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే అదనంగా పది వేలమంది వినియోగదారులు ట్యాంకర్లు బుక్ చేసుకున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఎమర్జెన్సీ పంపింగ్ కోసం సైతం ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆయా రిజర్వాయర్లలోనూ సమృద్ధిగా తాగునీటి లభ్యత ఉందన్నారు. కానీ కొందరు బెంగళూర్ పరిస్థితి నగరంలో వస్తుందని ప్రచారం చేస్తున్నారని, అందులో నిజం లేదన్నారు. ఇతర పట్టణాలతో మరో నగరాన్ని పోల్చడం సరికాదన్నారు. అక్కడి నీటి సోర్స్ వేరు, మన రాష్ట్రంలో నీటి సోర్స్ వేరన్నారు. రాబోయే రోజుల్లో రోజుకు 300 ట్యాంకర్ల ద్వారా 1200 ట్రిప్పులు సరఫరా చేస్తామన్నారు. నెలకు 2.5 లక్షల ట్రిప్పుల మేర నీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు వేశామన్నారు.

నగరంతోపాటు ఒఆర్ఆర్ పరిధిలో అవసరమైన చోట అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసిన 12 గంటల్లోపే డెలివరీ చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కొత్త ట్యాంకర్ల కోసం ఆర్టీఏ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్టు తెలిపారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి సరఫరా చేసే నీటిని శుద్ధి చేసేందుకు గండిపేట్ కాండూట్ మీద చిన్న నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు బస్టాండ్లు, జంక్షన్లు, ప్రధాన ఆస్పత్రులు, ఇతర జన సంచార ప్రదేశాల్లో 200 చలివేంద్రాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నగరంలో భూగర్భ నీటి మట్టాల్ని పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ట్యాంకర్ ద్వారా వాటర్ బుక్ చేసుకుంటున్న వినియోగదారులకు, ఒకవైపు నీరు సరఫరా చేస్తూనే మరో వైపు ఇళ్లల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకునేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. అందుకోసం పలు స్వచ్ఛంద సంస్థల్ని ఉపయోగించుకుంటామన్నారు. ఇంకుడు గుంతలు లేనివారికి కొత్తవి నిర్మించడం, ఉన్న వాటిని మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకుడు గుంతలు లేని వారురూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇలా చేస్తేనే వచ్చే ఏడాది నాటికి ట్యాంకర్ల ద్వారా నీరు బుక్ చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి, ఇడి డా.ఎం సత్యనారాయణ, డైరెక్టర్లు, ఆర్‌టిఎ అధికారులు, సిజిఎంలు, జిఎంలు, ఎన్‌జిఒ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాహుల్ గాంధీ వరాలజల్లు

- మెట్టు సాయికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మత్స్యకారుల కుటుంబాలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వరాల జల్లు కురిపించారని టిపిసిసి ఫిషర్మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల ద్వారా క్రెడిట్ కార్డులు, బోట్లకు సబ్సిడీతో పెట్రోల్, డీజిల్, చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు మూడు నెలల్లోనే జీవిత బీమా తదితర పథకాలను తమ పార్టీ ఇవ్వబోతుందని తెలిపారు. మత్స్యకారులను ఏనాడు పట్టించుకోనీ బిఆర్‌ఎస్, బిజెపిలకు బుద్ధి చెప్పి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ఆయన కోరారు.

ఆస్కిలో రెస్పాన్సిబుల్ ఇన్ఫ్లుయెన్సింగ్ కోర్సు

ప్రజాశక్తి - హైదరాబాద్
అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆస్కి) శిక్షణా విభాగం ఆస్కి అకాడెమీ కొత్తగా రెస్పాన్సిబుల్ ఇన్ఫ్లుయెన్సింగ్ (బాధ్యతగల ఇన్‌ఫ్లుయెన్సింగ్ కోర్సు) ఇ-లెర్నింగ్ సర్టిఫికేషన్‌ను ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. కంటెంట్ సృష్టికర్తలు కోడ్, చట్టానికి అనుగుణంగా ఉండటానికి, ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ పరిశ్రమలో నైతిక ప్రమాణాలు, పారదర్శకతను సమర్థించేలా ఈ కోర్సును రూపొందించినట్లు ఆ సంస్థ పేర్కొంది.


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

చివరి దశలో పంటలెండుతున్నాయ్..

- ఎస్ఆర్‌సిపి నీటిని విడుదల చేసి ఆదుకోవాలి
- రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పంటలు చివరి దశలో నీళ్లు లేక ఎండిపోతున్నాయి.. వెంటనే ఎస్ఆర్‌ఎస్‌పి ప్రధాన కాలువ నుంచి డీ-86, డీ-87 కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రం సమీపంలోని డీ-87 కాలువ వద్ద ప్రధాన రహదారిపై కొలిమికుంట, చాకుంటా, వెదురుగట్ట, చొప్పదండి గ్రామాల రైతులు సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న పంటలు చివరి దశలో నీళ్లలేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీ వరకు ఎస్ఆర్‌సిపి నీళ్లు వచ్చాయన్నారు. ఈ ఏడాది అధికారులు నీళ్లు విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న పంట పొలాలను కాపాడేందుకు ఉన్నతాధికారులు స్పందించి.. చివరి మడి వరకు ఎస్ఆర్‌ఎస్‌పి మెయిన్ కెనాల్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడే ప్రయత్నం చేయగా.. ఎమ్మెల్యే, కలెక్టర్ రావాలని నినాదాలు చేశారు. ఎస్ఐ రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

మహిళపై కత్తితో దాడి

పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
గుర్తుతెలియని యువకుడు ఓ ఇంట్లోకి చొరబడి కత్తితో మహిళపై దాడి చేసి బంగారం, పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపల్ పరిధి అత్వెలీలోని ఎస్ఎల్ ఆర్ వెంచర్‌లోని ఓ ఇంట్లో బాగారి మహామాయ అనే మహిళ నివసిస్తోంది. ఆదివారం రాత్రి ఆమె ఇంట్లోకి మంకీ క్యాప్ పెట్టుకుని గుర్తు తెలియని యువకుడు చొరబడ్డాడు. కత్తితో ఆమెపై దాడి చేసి మెడలోని బంగారు పుస్తెల తాడు, మరో బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఈ దాడిలో మహిళ కుడి చేతికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ చేరుకొని పరిశీలించారు. పోలీసులు సీసీటీవీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

కార్పొరేట్ కనెక్షన్స్ నూతన చాప్టర్ ఏర్పాటు

ప్రారంభించిన జయేష్ రంజన్

హైదరాబాద్ : గ్లోబల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్, కార్పొరేట్ కనెక్షన్స్ తన కార్యకలాపాలను విస్తరించింది. హైదరాబాద్‌లో చాప్టర్ 7ను తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టెర్మినస్ గ్రూప్ సిఎండి ఎస్‌పి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎస్ శరద్ మహిశ్వరి, మాస్టర్ ఫ్రాంచైజ్ కెవిటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. కార్పొరేట్ కమ్యూనికేషన్స్‌కి హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు చాప్టర్లు ఉండగా.. ఇది మూడోది. కొత్త చాప్టర్‌లో 21 మంది వ్యక్తులు, వ్యాపార యజమానులు ప్రారంభ సభ్యత్వాన్ని కలిగి ఉన్నారని శరద్ మహిశ్వరి పేర్కొన్నారు. ఒక్కో అధ్యాయానికి 25 మంది సభ్యత్వాన్ని పరిమితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రగతిశీల రాష్ట్రమన్నారు. కానీ మన పురోగతి కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యింది. పెద్ద కంపెనీలు బాగా రాణిస్తుండగా ఎంఎస్ఎంఇలు ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని మూతపడుతున్నాయి. పట్టణ నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతుండగా, గ్రామీణ ప్రాంతాలు స్తబ్దుగా ఉన్నాయి. తద్వారా రాష్ట్రంలో ఆర్థిక వృద్ధిని సమతుల్యం చేయాల్సిన అవసరం ఉంది." అని అన్నారు.

మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించండి

- సిపిఎంను గెలిపించండి జహంగీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న సిపిఎంను గెలిపించాలని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎండి జహంగీర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల పట్టణం, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల సిపిఎం కార్యకర్తల సమావేశం చేర్యాల మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో జహంగీర్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం, పేదరికం, ఆకలి పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న మతోన్మాద రాజకీయాలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. దేశం వెనుకబడటానికి కారణమైన కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేస్తోందన్నారు. బిఆర్‌ఎస్ పది సంవత్సరాలుగా నియంతృత్వంగా వ్యవహరించిన ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు విస్మరించారన్నారు. ఎలాంటి చరిత్ర లేని వ్యక్తులు అభ్యర్థులుగా పోటీకొస్తున్నారని తెలిపారు. నీతి, నిజాయితీ పోరాటాల వారసత్వం కలిగిన సిపిఎం అభ్యర్థిగా భువనగిరి పార్లమెంటు స్థానంలో పోటీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద రాజకీయ పార్టీల అభ్యర్థులను తిరస్కరించాలని, పదవుల కోసం అనైతికంగా వ్యవహరిస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి కోసం పనిచేస్తున్న తనను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం అడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సందబోయిన ఎల్లయ్య, గోడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సిపిఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎండి జహంగీర్

ఇఫ్తార్ విందులో ఎండీ.జహంగీర్
నిత్యం పేదలు, కార్మికులు, కర్షకుల సమస్యల పై అలుపెరగని పోరాటు చేస్తున్న తనకు ఓటేసి గెలిపించాలని భువనగిరి పార్లమెంటు నియోజక వర్గ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలోనే తమ పార్టీ పోటీ చేస్తుందని, నిరంతరం పేదల, కార్మికుల, కర్షకుల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని ముస్లిములను కోరారు. అనంతరం మాజిత్ కమిటీ సభ్యులు జహంగీర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎంఎ ఇక్బాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మంగ నరసింహులు, మండల కార్యదర్శి దూపటీ వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ముస్లింలు ఎండి బద్రుద్దీన్, ఎండి రఫీ, ఎండి ఖలీల్, ఎండి జైనుద్దీన్, అఖిల్, ఎండి సలీం, ఎండి అప్సర్, ఎండి జహంగీర్, ఎండి మతిన్, ఎండి అజర్ పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో వెలుగులోకి సంచలన నిజాలు

- నల్లగొండ జిల్లా కేంద్రంగా ఆపరేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో సంచలనం వెలుగు చూస్తోంది. ఆదివారం రాత్రి జరిగిన విచారణలో ఈ కేసులో నల్లగొండ జిల్లా కేంద్రంగా ఆపరేషన్ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు తేలింది. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌తో రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు.. వ్యక్తిగత లబ్ది కోసం మరికొందరు ప్రయత్నించినట్టు నిర్ధారించారు. మునుగోడు ఉపఎన్నికల సమయంలోనూ ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. అదే అదునుగా ఓ కానిస్టేబుల్ ఫోన్ ట్యాపింగ్‌తో మహిళల వ్యక్తిగత జీవితాలతో ఆడుకున్నట్టు విచారణలో తేలింది. పలువురు మహిళలను కానిస్టేబుల్ బ్లాక్ మెయిల్ చేసినట్టు అధికారులు గుర్తించారు. అయితే, అప్పటి జిల్లా పోలీస్ బాస్‌తో సదరు కానిస్టేబుల్‌కు సాన్నిహిత్యం ఉన్నట్టు తెలుస్తోంది. ఆ చొరవతోనే ఉన్నతాధికారులను సైతం భయపెట్టారని సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌తో జిల్లాలో పలు దందాల్లోనూ జోక్యం చేసుకుని ఓ కానిస్టేబుల్ కోట్ల రూపాయలు వసూలు చేశాడట.. రౌడీషీటర్లతో సెటిల్‌మెంట్స్ చేయించి.. గుర్రంపోడ్ వద్ద ఓ పోలీస్ బాస్ బినామీల పేరిట తొమ్మిదెకరాల తోట కొనుగోలు చేసినట్టు సమాచారం. నార్కట్‌పల్లి వద్ద గంజాయి కేసులో దొరికిన వారి వ్యక్తిగత జీవితాల్లో ప్రవేశించిన సదరు కానిస్టేబుల్ వారిని వేధింపులకు గురిచేశాడని విచారణలో తేలింది. వందల మందికి సంబంధించిన ఫోన్ రికార్డ్స్ విని బెదిరింపులకు పాల్పడి.. కోట్లు వసూలు చేసినట్టు తాజా విచారణలో వెల్లడైంది. సుమారు 40మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇద్దరు జర్నలిస్టుల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేశాడట. పేకాట దందాల్లో నెల నెలా మామూళ్లు వసూలు చేసేవాడట. ఇటీవలే ఈ కానిస్టేబుల్‌తో పాటు మరొకరిని హైదరాబాద్ టీమ్ అదుపులోకి తీసుకోగా.. విచారణలో ఈ వివరాలన్నీ బయటపడ్డాయని సమాచారం.

గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

- చివరి తేదీ ఏప్రిల్ 12, 28న ప్రవేశ పరీక్ష
- విద్యార్థులకు ఉచిత విద్య, భోజన వసతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ మహాత్మా జ్యోతిబాపూలే బిసి సంక్షేమ (ఎంజెపిటిబిసిడబ్ల్యు), ఎస్‌సి (టిఎస్‌డబ్ల్యు)సంక్షేమ, ఎస్‌టి (టిటిడబ్ల్యు) సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష- ఆర్‌డిసి సెట్-2024 నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ద్వారా డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన అభ్యర్థులు ఏప్రిల్ 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బిసి సంక్షేమ గురుకుల సొసైటీలో 15 బాలుర కళాశాలలు, 15 మహిళా కళాశాలలు, ఎస్‌సి సంక్షేమ గురుకుల సొసైటీలో 26 మహిళా కళాశాలలు, ఎస్‌టి సంక్షేమ గురుకుల సొసైటీలో ఆరు బాలుర కళాశాలలు, 15 మహిళా కళాశాలలున్నాయి. 2024 లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. డిగ్రీలో ప్రవేశాల కోసం ఆయా కళాశాలల్లో బిఎ (హెచ్‌పిఎస్, ఇపిఎస్‌పిఎ, ఇపిహెచ్, హెచ్ఇపి, ఇపిపి, హెచ్‌పిఇ, హెచ్ఇఎస్, ఐఆర్‌ఇపి, పిపిజిఇపి), బీకాం (సిఎ,బిఎ,జి), బిఎస్‌సి (ఎంపిసి, ఎంపిపిఎస్, బిజెడ్‌సి, ఎంబిజెడ్‌సి, ఎంపిజి, ఎంఎస్‌డిఎస్, బిజెడ్‌జి, బిటిబిసిసి, ఎంఇసిఎస్, బిబిసిసి, ఎన్‌జెడ్‌సి, ఎంఎస్ఎఇ, ఎంఎల్, ఎంబిజెడ్‌జి, బిబిటిసి, ఎఎన్‌పిహెచ్‌బిసి) కోర్సులతోపాటు బిహెచ్‌ఎంసెట్, బిబిఎ, బిఎఫ్‌టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి కోర్సులో 40 సీట్లు ఉన్నాయి. గురుకుల కళాశాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచితంగా విద్యా, భోజన వసతి అందిస్తారు. యూనిఫామ్‌లు, నోట్ బుక్స్‌తో పాటు పాఠ్యపుస్తకాలు కూడా అందిస్తారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యావకాశాలు అందుకునేలా ఇక్కడి విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో ంతీసిఎష్‌వ్.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఊఅ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లు ఏప్రిల్ 21 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. టిజిఆర్‌డిసి సెట్ 2024 ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న జరగనుంది.


సిఎం రేవంత్‌కి వినతి పత్రం అందజేస్తున్న హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులు

హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయండి

- 25 జిఒను రద్దు చేయాలి లేదా సవరించాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి హిందీ పండిత్ పరిరక్షణ సమితి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలంగాణ హిందీ పండిత్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జిఒ నెంబర్ 25ను రద్దు చేయాలని, లేదంటే సవరించాలని కోరింది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సమితి నాయకులు ఎం రవి, నసీరా, విజయలక్ష్మి, సలీమా, రామలక్ష్మి, రామ్‌సింగ్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవోనెంబర్ 1415ను యథాతథంగా అమలు చేయాలని, హిందీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలనీ, కటాఫ్ తేదీని ప్రకటించాలని కోరారు. హిందీ విద్వాన్, మధ్యమ (విశారద్) హిందీ ధ్రువపత్రాలతో తాము హిందీ ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేశామని వివరించారు. ఆ ధ్రువపత్రాలపై 2013 ఎల్పిసెట్ కౌన్సెలింగ్ సమయంలో వివాదం ఏర్పడితే నాటి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని తెలిపారు. వాటిని పూర్తిస్థాయి డిగ్రీ ధ్రువపత్రాలుగా పరిగణించలేం కానీ హిందీ చదువుల నిమిత్తం మాత్రమే పనిచేస్తాయని నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. కొద్ది మంది ప్రయోజనాల కోసం తెచ్చిన 25 జిఒ వల్ల సుమారు 30 వేల మంది హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. డిఎస్‌సి హిందీ ఉపాధ్యాయ పోస్టులకు విద్వాన్, మధ్యమ (విశారద్) ధ్రువపత్రాలనూ పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగాన్ని ముట్టుకుంటే బిజెపి భూస్థాపితం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్
- రాజ్యాంగాన్ని మారుస్తామన్న పార్టీలకు ఓటు వేయొద్దు : ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
"రాజ్యాంగాన్ని ముట్టుకుంటే బిజెపిని భూస్థాపితం చేస్తాం.. అలాంటి రాజకీయ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి" అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, ప్రొ.కోదండరామ్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్‌లోని బొమ్మక్ బాలయ్య గార్డెన్స్‌లో "రాజ్యాంగ రక్షణ సదస్సు" నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. తాను పదవుల కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, రాజ్యాంగానికి రక్షణ కల్పించడం కోసం మాత్రమే చేరానని తెలిపారు. దేశానికి రాజ్యాంగమే రక్ష అని చెప్పారు. దేశంలో మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉంటుందని, అందుకోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సుమారు 1000 మందితో రాజ్యాంగ రక్షణ యాత్ర చేపడతామని అన్నారు. మాల మహానాడు సంఘం ఎస్సీ వర్గీకరణకు సంబంధించినది కాదని, మందకృష్ణ మాదిగతో తనకు సత్సంబంధం ఉంటుందని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద టెంట్‌హౌస్‌లు పెడతామన్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు సరికావన్నారు. దేశంలో తనకు ఇష్టమైన ఒక మహిళ సోనియా గాంధీ అన్నారు. రేవంత్ రెడ్డి తనను ఒక కుటుంబ సభ్యునిగా పరిగణిస్తారని.. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, పిసిసి అధ్యక్షునిగా సరైన నాయకుడు రేవంత్ రెడ్డి అని తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఊచకోత నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి మహిళా చట్టాన్ని తీసుకొచ్చారన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ప్రొ కోదండరామ్

దేశంలో అణచివేయబడిన సమాజం ఏదైనా ఉంది అంటే అది ఒబిసి వర్గం మాత్రమేనన్నారు. ఒబిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒబిసి రిజర్వేషన్ అమలవుతుందని చెప్పారు. మాల మహానాడును విస్తృత రాజ్యాంగ పరిరక్షణ సమితిగా తయారు చేయాలని తన ఉద్దేశం అన్నారు. కంటోన్మెంట్ టికెట్టు రానందున దయాకర్ అలిగాడని మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని.. కానీ తాను సినిమా రంగం కోసం చెన్నై, మద్రాస్ తిరుగుతున్నానని చెప్పారు. తన సినిమా, తన జీవితం.. తన ఉద్యమంలో అన్నీ బడుగు బలహీనవర్గాల కోసమేనన్నారు. ప్రపంచం మొత్తం ఒక మేధావి రాజ్యాంగాన్ని రచించాడు అంటుంటే.. మన భారతదేశం మాత్రం ఒక దళితుడు రాజ్యాంగాన్ని రచించాడు అనడం దౌర్భాగ్యం అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న పార్టీలకు ఓటు వేయొద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు మన్నె బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, బైరు రమేష్, ఆంధ్రమాల మహానాడు అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెరువులు, కుంటల లీజులను రద్దు చేయాలి

- ఉచిత చేప, రొయ్య పిల్లలకు సొసైటీల ఖాతాలో నగదు జమ చేయాలి : టిఎంఎంకెఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ఎండిన చెరువులు, కుంటల లీజులను రద్దు చేయాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం (టిఎంఎంకెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహా అధ్యక్షతన గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కరువు ప్రభావంతో రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎండిపోయాయని తెలిపారు. దీంతో మత్స్య పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు అనేక ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. ఈ ఏడాది చేప, రొయ్యపిల్లల పంపిణీ టెండర్ల విధానం కాకుండా మత్స్య సొసైటీల ఖాతాల్లో నగదు జమచేయాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్ల నుంచి చేపల, రొయ్యల పంపిణీ టెండర్లలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యపరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిని నియమించాలని కోరారు. సుమారు పది లక్షల మత్స్యకార కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. దాదాపు 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4.20లక్షల మంది సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని, మరో పక్క పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పట్టణాల్లో రసాయనాలను డ్రైనేజీని చెరువులు, కుంటల్లోకి వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మత్స్య సంపద అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాలకు గురైన చెరువులు, కుంటలు, జలవనరులను గుర్తించి కాపాడాలని డిమాండ్ చేశారు. పదేండ్లలో మత్స్య శాఖలో ఎన్‌సిడిసి నుంచి తెచ్చిన రూ. వెయ్యి కోట్ల రుణాలు, సంక్షేమ పథకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వృత్తి ప్రమాదంలో చనిపోయిన వారికి పరిహారం, ఇన్సూరెన్స్ అందక ఆయా కుటుంబాలు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. జిల్లాల మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలు జరిపి రాష్ట్ర పెడరేషన్‌కూ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ వెంకన్న, మామిళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి జీతాలను తక్షణమే చెల్లించండి

- మే నెలంతా సెలవులివ్వండి : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు మార్చి జీతాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మే నెలంతా వారికి ఒకేసారి సెలవులివ్వడంపై తొందరగా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె సునీత, ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి, కోశాధికారి పి మంగ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల ఎనిమిదో తేదీ వచ్చినా గతనెల వేతనాలు ఇంకా రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగాది, రంజాన్ పండుగలున్నాయని వివరించారు. పండుగల నేపథ్యంలో వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలు అవీ సకాలంలో రాకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. వచ్చేనెలంతా సెలవులపైన ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అసంతృప్తికి గురవుతున్నారని తెలిపారు. ఎండల తీవ్రత, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల్లేకపోవడం, పెద్ద పిల్లలు ఇంట్లో ఉన్నపుడు చిన్న పిల్లలు ఎంత బలవంతం చేసినా రావడం లేదని వివరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 24 రోజులపాటు సమ్మె సందర్భంగా వచ్చేనెల సెలవులపైన గత ప్రభుత్వం ఇచ్చిన హామీలనూ అనేకసార్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దృష్టికి తెచ్చామని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని తెలిపారు. సమస్యలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కోరారు.

